

భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 34.0
కనిష్ఠం : 16.0





భీమవరంలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి

వైసీపీ పాలనతో విధ్వంసం

ప్రజలకు వివరించేందుకు ఈ నెల 9 నుంచి 11 వరకు పల్లెకు పోదాం.. 20 నుంచి పోరుయాత్ర

భీమవరంలో ఎన్నికల శంఖారావం పూరించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి



భీమవరం టౌన్, ఫిబ్రవరి 1 : 'రాష్ట్రంలో సాగుతున్న వైసీపీ విధ్వంసకర, ప్రజా కంటక పాలనపై ప్రతి కార్యకర్త గళం విప్పాలి. ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు 'పల్లెకు పోదాం' కార్యక్రమంలో భాగంగా ప్రజల వద్దకు వెళ్లి వాటిని వివరించాలి. 20 నుంచి 29 వరకు పోరుయాత్ర నిర్వహించాలి' అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి పిలుపునిచ్చారు. భీమవరంలో నరసాపురం లోక్‌సభ ఎన్నికల కార్యాలయాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో వైసీపీ పాలనపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. బీజేపీ బలోపేతానికి కేంద్ర ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకుని వెళ్లాలని కోరారు. జిల్లా అధ్యక్షునితోపాటు గ్రామంలోని పార్టీ కార్యకర్తలు 24 గంటలు ప్రజలకు అందుబాటులో వుండి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. రానున్న సార్వత్రిక ఎన్నికలకు భీమవరం నుంచి ఎన్నికల శంఖారావం పూరించామని తెలిపారు. ఇక్కడి నుంచి రాష్ట్రంలోని 25 పార్లమెంటు నియోజక వర్గాల్లోని కార్యాలయాలను వర్చువల్‌గా ప్రారంభించామన్నారు. 'నరసాపురం వద్ద నిర్మించే వశిష్ట వారధికి రూ.400 కోట్లను కేంద్రమే కేటాయించింది. పోలవరం ప్రాజెక్టుకు జాతీయహోదా ఇచ్చిన తర్వాత ప్రతీ పైసా కేంద్రమే చెల్లించింది. గత ప్రభుత్వ హయాంలో మూడేళ్లపాటు జాప్యం చేస్తే.. వైసీపీ హయాంలో రివర్స్ టెండరింగ్ విధానం వల్ల నిర్మాణం దెబ్బ తింది' అని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ నరసాపురం ఎంపీ అభ్యర్థిని గెలిపించాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. పురందేశ్వరికి పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. భారీ ర్యాలీగా తీసుకువచ్చారు. ఆమెకు క్రేన్ సాయంతో భారీ గజమాలను వేశారు. నర్సయ్య అగ్రహారంలో నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఇక్కడి నుంచి వర్చు వల్ విధానం ద్వారా 25 పార్లమెంట్ నియోజకవర్గాల కార్యాలయాలను ప్రారం భించారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగి కాశీ విశ్వనాధరాజు, నారిన తాతాజీ, నిర్మల కిశోర్, పాకా వెంకటసత్యనారాయణ, పేరిచర్ల సుభాష్‌రాజు, షేక్ బాజీ, దంతులూరి నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

8న షర్మిల జంగారెడ్డిగూడెం రాక

జంగారెడ్డిగూడెం, ఫిబ్రవరి 1 : పీసీసీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఈ నెల ఎనిమిదో తేదీ సాయంత్రం నాలుగు గంటలకు జంగారెడ్డిగూడెం పట్టణంలో రోడ్ షో, బహిరంగ సభ నిర్వహించనున్నట్టు కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు జెట్టి గురున్నాధరావు తెలిపారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల ప్రజలతోపాటు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొనాలని ఆయన కోరారు.



కాల్వలోకి సభా ప్రాంగణం

అడ్డొస్తే అంతే..!

ఏలూరులో రేపు సీఎం సభ

'సిద్ధం' ఫ్లెక్సీలకు చెట్ల నరికివేత

సభ కోసం కాలువ పూడ్చివేత

■ మెయిన్‌లో..

సీఎం సభ కోసం వాహనాల మళ్లింపు

3వ తేదీ ఉదయం నుంచి రాత్రి వరకు..

ప్రజలు సహకరించాలని ఏలూరు జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి విజ్ఞప్తి

■ వివరాలు 7లో..




ఏలూరులో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

160 సీట్లతో టీడీపీ-జనసేన విజయం ఖాయం

చింతలపూడిలో ఈ నెల 5న చంద్రబాబు 'రా కదలిరా' సభకు తరలి రావాలని నేతల పిలుపు

ఏలూరు రూరల్/చింతలపూడి, ఫిబ్రవరి 1 : 'సీఎం జగన్ అరాచకాలు, మోసాలతో ప్రజలు విసుగు చెందారు. ప్రజాస్వామ్య విలువలు కాపాడటానికి తిరిగి చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుతున్నారు' అని టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. చింతలపూడిలో ఈ నెల 5న జరిగే చంద్రబాబు 'రా.. కదలిరా' సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. చంద్రబాబు పర్యటన ఏర్పాట్లపై ఏలూరులోని టీడీపీ జిల్లా కార్యాల యంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఓట్ల కోసం కులగణన పేరుతో బీసీలను, డీఎస్సీ పేరుతో నిరుద్యోగ యువతను మోసం చేస్తున్నారని, ఇన్ని రోజులు వీరు గుర్తుకురాలేదా? అని ప్రశ్నించారు. టీడీపీ, జనసేన రాష్ట్రంలో 150 నుంచి 160 సీట్లు సాధిస్తుందన్నారు. ఏలూరు జిల్లా టీడీపీ కన్వీనర్ గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ రాష్ట్రంలో పరిపాలన చేత కాని సీఎం జగన్ ఆటవిక పాలన సాగిస్తున్నారని, ఆ పాలనను అంతం చేసి రాష్ట్రం స్వర్ణయుగం సాధించేందుకు ఈ సభ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. సభకు టీడీపీ, జనసేన కార్యకర్తలు, నాయకులు హాజరుకావాలని పిలుపునిచ్చారు. మాజీ మంత్రులు కేఎస్ జవహర్, దేవినేని ఉమ, పీతల సుజాత, మాజీ ఎంపీలు కొనకళ్ళ వెంకటనారాయణ, మాగంటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జగన్ దిగిపోతేనే రాష్ట్రానికి మంచి రోజులు వస్తాయని అన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు చింతమనేని ప్రభాకర్, ఘంటా మురళి, ఆరిమిల్లి రాధాకృష్ణ, నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లు బడేటి చంటి, బొరగం శ్రీనివాసరావు, ముద్దరబోయిన వెంకటేశ్వరరావు, వలవల బాబ్జీ, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు దాసరి ఆంజనేయులు, జి.శ్రీరామ్మూర్తి, దాసరి శ్యామ్‌సుందర శేషు, కె.నాగేశ్వరరావు, మెంటే పార్థసారథి, జగ్గవరపు ముత్తారెడ్డి, సొంగా రోషన్‌కుమార్, బొమ్మాజి అనిల్, కె.నవీన్‌కుమార్, ఆకుమర్తి రామారావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చింతలపూడిలోని చంద్రబాబు 'రా.. కదలిరా' బహిరంగ సభ ప్రాంగణంలో ఏర్పాట్లను టీడీపీ నాయకులు పరిశీలించారు.



ఇప్పటికింతే..!

మధ్యంతర బడ్జెట్‌లో కురవని వరాలు

- పీఎంఆర్‌పై ఇళ్ళ కోటా పెంపు
- సోలార్ పాలసీతో ఉచిత విద్యుత్
- నానో డీఏపీ ఎరువులకు భరోసా
- వేతన జీవులకు నిరాశే

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి):

కేంద్ర మధ్యంతర బడ్జెట్‌లో ఆశించినట్టు కాకుండా కేవలం కొన్ని వరాలతోనే సరిపుచ్చేశారు. కీలకమైన పోలవరం ప్రాజెక్టు గాని, ఇతరత్ర ఇరిగేషన్ పథకాలకు ఎలాంటి చేయూత ఇవ్వలేదు. ఆ మేరకు స్పష్టమైన సంకేతాలు ఉండేలా మాట వరుసకైనా ఇవ్వలేదు. పార్లమెంటులో గురువారం కేంద్ర మధ్యంతర బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టారు. పూర్తిస్థాయి బడ్జెట్ ఎన్నికల తర్వాతే ఉంటుందనే స్పష్టత ఇచ్చారు. క్లుప్తంగా బడ్జెట్‌ను ముగించారు. ఈ మధ్యంతర బడ్జెట్‌లో కేవలం కొన్నింటికి మాత్రమే ప్రాధాన్యత ఇచ్చారు. పీఎం ఆవాస్ యోజన కింద ఏటా కేంద్రం పక్కా గృహాలను మంజూరుచేస్తుంది. ఈ వార్షిక బడ్జెట్‌లో ఈ తరహా గృహాలు రెండు కోట్ల మేర ఉంటాయని భావించింది. ఇంతకుముందు వార్షిక బడ్జెట్‌లోను ఈ తరహా గృహాల సంఖ్యను ప్రతిపాదించడం, ఆ మేరకు రాష్ట్రాల వారీగా విభజించి కేటాయిస్తుంది. రాష్ట్రానికి వచ్చే వాటాను జిల్లాల వారీగా పంచుతారు. ఆ లెక్కన ఉమ్మడి పశ్చిమలో 15 వేల నుంచి 20 వేల గృహాలు మంజూరై ఉండేవి. ఈ ఏడాది ప్రకటన ప్రకారం పీఎంఆర్‌బై పథకం కింద కాస్తంత ఎక్కువగానే గృహాల సంఖ్య ఉండవచ్చని జిల్లా అధికారులు అంచనా వేస్తున్నారు. ఎన్నికలకు ముందు వెలువడిన ఈ కేటాయింపు కొందరిలో ఆశలు రేపింది. సోలార్ పథకం కింద 300 యూనిట్లలోపు విద్యుత్‌ను అందించేందుకు కేంద్రం కొత్త పథకాన్ని ఈ బడ్జెట్‌లోనే ప్రవేశపెట్టింది. ఈ కారణంగా సాధారణ, మధ్య తరగతి కుటుంబాలకు విద్యుత్ వ్యయంలో ఏడాదికి రూ.15 వేల నుంచి రూ.20 వేల రూపాయలు కలిసి వస్తుందన్నట్టు బడ్జెట్‌లో వివరించే ప్రయత్నం చేశారు. ఆయుష్మాన్‌భవ స్కీం ఆశ, అంగన్‌వాడీలకు వర్తిస్తున్నట్టు ప్రకటన చేశారు. రాష్ట్రంలో అంగన్‌వాడీలకు ఇచ్చే ప్రత్యేక సదుపాయాలను రాష్ట్ర ప్రభుత్వం ఇంతకుముందే ఉపసంహరించుకుంది. కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించిన ఈ వరం ఆశ, అంగన్‌వాడీ కుటుంబాల్లో ఆశలు రేపింది. ఏటా మాదిరిగానే ఈసారి మధ్యంతర బడ్జెట్‌లో పోలవరం ప్రాజెక్టు ఊసేలేదు. రైల్వేకు సంబంధించి ఇలాంటి ప్రయత్నమే చేశారు. పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టినప్పుడు ఈ తరహా కీలక అంశాలపై పద్దు తేలనుందని అంచనా వేస్తున్నారు. ప్రత్యేకించి వేతన జీవులు, ఇతర వర్గాలు ఆశించినట్టు ఆదాయ పరిమితి విషయంలో కేవలం ప్రతిపాదన మాత్రమే చేశారు. అసలు గుట్టు మాత్రం విప్పలేదు.









ఉద్యోగులు, పెన్షనర్లకు నిరాశ

ఆదాయ పన్ను పరిధి, పన్ను రేట్లలో ఎలాంటి మార్పు లేకపోవడంతో ఉద్యోగులకు, పెన్షన్‌దారులకు నిరాశ కలిగించింది. ఐదు ఆక్వా పార్కుల ఏర్పాటు గోదావరి జిల్లాలకు ఎంతో ఉపయోగకరం. న్యూ రూఫ్ టాప్ సోలార్ పవర్ పథకంలో 300 యూనిట్ల కరెంటు ఉపయోగంతో పాటు సోలార్ ప్లాంట్ పెట్టుకోవడానికి రాయితీ ఇవ్వడం వల్ల ప్రతి గృహస్తుడు కొంత సొమ్ము పొదుపు చేసుకోవచ్చు. 2014-23 కాలానికి ఎఫ్‌డీఐ ద్వారా 596 బిలియన్ యుఎస్ డాలర్లు ఇండియాలో పెట్టుబడి పెట్టినట్టు తెలిపినా, పెట్టుబడులు ఉపయోగించుకున్న తర్వాత నికర పెట్టుబడులు విలువను తెలపలేదు. పీఎం ఆవాస్ యోజనలో రెండు లక్షల కోట్ల గృహాలను బడుగు, మధ్యతరగతి వర్గాలకు అందజేయడం హర్షణీయం. వికసిత్ భారత్ ద్వారా రూ.75 వేల కోట్లు రాష్ట్ర ప్రభుత్వాలకు అందించడం రాష్ట్రాల అభివృద్ధికి తోడ్పడుతుంది.



\- చెరుకూరి శ్రీనివాసరావు, బ్రహ్మయ్య అండ్ కో చార్టర్డ్ అకౌంటెంట్

నిన్న తమ్మయ్య నేడు బోస్

నరసాపురం వైసీపీ ఎంపీ అభ్యర్థి ఎంపికలో గందరగోళం

- ఇలా ప్రకటించి.. తర్వాత తూచ్ అంటూ వెనక్కు
- బీసీ నినాదంతో బరిలో.. నిలిపేందుకు ఆపసోపాలు



(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి):

ఎంపీ స్థానాలకు పోటీ చేసే అభ్యర్థుల కోసం వైసీపీ నానా తిప్పలు పడుతోంది. నిన్న మొన్నటి వరకు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి కొత్త ముఖాలను ఎంపిక చేయడం, పాత ముఖాలను ఇంటికి పంపడం వంటి కసరత్తుకు దిగిన వైసీపీ సిట్టింగుల వ్యతిరేకతతో కాస్త డైరెక్షన్ మార్చింది. ఎంపీ స్థానాలకు పోటీ చేసే వారి కోసం దుర్భిణి వేసి మరి గాలించింది. బీసీ నినాదంతో నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గం నుంచి అభ్యర్థుల కోసం జల్లెడ పట్టింది. చివరకు మాజీ జడ్పీటీసీ, శెట్టిబలిజ కార్పొరేషన్ ఛైర్మన్ గుబ్బల తమ్మయ్యను ఇక్కడి నుంచి పోటీకి వీలుగా 'సిద్ధం'కండి అంటూ సంకేతాలు ఇచ్చేశారు. ఆయన కూడా వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యేలందరి మన్ననలు పొందాలని తన సన్నిహితులతో కలిసి వారి చుట్టూ తిరిగారు. పార్టీ సమన్వయ కర్త, ఎంపీ మిథున్‌రెడ్డి నుంచి ఈ మేరకు తనకు సంకేతాలు వచ్చాయని, మీరందరూ కలిసొస్తే పోటీకి సిద్ధమవుతానని పేర్కొన్నారు. మరోవైపు తెలుగుదేశం-జనసేన పొత్తులో భాగంగా సిట్టింగ్ ఎంపీ రఘురామకృష్ణంరాజు పోటీలో ఉంటారని తేలిన తర్వాత ఆర్థికంగా పరిపుష్టి లేని తమ్మయ్యను రంగంలోకి దింపడం పార్టీకి లాభమా, నష్టమా అనే చర్చ ఎమ్మెల్యేలు, కన్వీనర్లలో జరిగింది. ఈ నేపథ్యంలో మిథున్‌రెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డితో భేటీ అయ్యి తమ్మయ్య కాకుండా కాస్తంత ఆర్థిక పరిపుష్టి, కులపరంగా ఇంకాస్త ఇమేజ్ ఉన్న నేతను రంగంలోకి దింపాలని అభ్యర్థిం చారు. వాస్తవానికి నరసాపురం నుంచి బీసీ అభ్యర్థులను రంగంలోకి దింపాలని ఏడాది క్రితం నుంచే వైసీపీ కసరత్తు ప్రారంభించింది. శెట్టిబలిజ సామాజిక వర్గం నుంచి అభ్యర్థిని ఎంపిక చేసి పోటీకి నిలబెడితే పార్టీకి మేలనే ఐ ప్యాక్ నివేదికలను పరిగణనలోకి తీసుకున్నారు. ఎలాగూ గోదావరి జిల్లాల్లో ఎంపీ స్థానాలకు తెలుగుదేశం నేరుగా బీసీయేతర అభ్యర్థులనే రంగంలోకి దింపడం ఖాయమని భావించింది. దీనికి విరుగుడుగా బీసీ నినాదం వైసీపీ అందిపుచ్చుకుంది. ఎంపీ స్థానాల్లో బీసీలకు అవకాశం ఇస్తున్నామని పదేపదే చెప్పే ప్రయత్నం చేసింది.

> ఈ నెల 3న ఏలూరు సమీపాన సిద్ధం సభకు సీఎం జగన్ హాజరవుతున్నారు. ఈలోపు మరింత కసరత్తు చేసి ఆ తదుపరే సమన్వయ కర్తల జాబితాలో ఆయనను చేర్చబోతున్నారనే అంచనాలో పార్టీ ఉంది. అయితే పార్టీలో ఎంపీ అభ్యర్థిగా నానిన తమ్మయ్య, ఆయన అనుచరులంతా ఇప్పుడు ఇరకాట పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. వైసీపీలో మైండ్ గేమ్ పెరిగిందని, పైకొకమాట, చెప్పేది ఇంకొకమాట అన్నట్టు వైసీపీ వ్యవహరిస్తోందన్న విమర్శలు వెల్లువెత్తాయి.

ఇలా ప్రకటించి..

మిగతా ఎంపీ స్థానాల్లో అభ్యర్థుల మార్పు, చేర్పులు జరుగుతున్నట్టే నరసాపురం లోక్‌సభ నియోజకవర్గంలోను అభ్యర్థి ఎంపికలో తొలుత ప్రతిపాదిత నేతగా తమ్మయ్యను ఇచ్చినట్టే ఇచ్చి ఆ వెంటనే వైసీపీ నాయకత్వం వీచేముడ్ చెప్పేసింది. శెట్టిబలిజ సామాజిక వర్గం నుంచి ఎవరూ పోటీకి ముందుకు రాకపోవడం, అయినా ఇదిగో ఎన్ఆర్ఐ.. అదిగో ఎన్ఆర్ఐ అభ్యర్థి అంటూ కొంత కాక పుట్టించే ప్రయత్నం జరిగింది. వీటన్నింటికీ వ్యతిరేకంగా ఇప్పుడు సిట్టింగ్ ఎమ్మెల్యేలు ఎంపీ అభ్యర్థి విషయంలో అసంతృప్తికి గురికావడంతో కొత్త పేరును తెరమీదకు తేబోతున్నారు. ఈ నియోజక వర్గం నుంచి ప్రస్తుత రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్‌ను రంగంలోకి దింపాలని యోచిస్తున్నట్టు ఆ మేరకు పార్టీలోను చర్చ సాగుతోంది. ఇప్పటికే బోస్ తనయుడికి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా రామచంద్రపురం ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నందున ఈ తాజా ప్రతిపాదనను బోస్ అంగీకరిస్తారా, లేదా అనేది ఇప్పుడు సస్పెన్స్‌గా మారింది. వైసీపీ వ్యవహారాల్లో చాలా కాలంపాటు బోస్ వైసీపీ పక్షాన ఇన్‌చార్జ్‌గా వ్యవహరించారు. ఎన్నికల సమయంలోను కీలక బాధ్యతలు తీసుకుని ఆ మేరకు కథ నడిపారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో నరసాపురం లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేయడానికి తగిన అభ్యర్థి లభించక, ఇతరులు ఎవరూ ఆ వైపు తొంగి చూడకపోవడంతో చేసేది లేక పిల్లి వైపే వైసీపీ మొగ్గు చూపుతోంది.

పలువురు పోలీసు అధికారుల బదిలీ

భీమవరం క్రైం, ఫిబ్రవరి 1 : జిల్లాలో పలువురు పోలీసు అధికారులకు బదిలీ అయ్యాయి. పశ్చిమ గోదావరి జిల్లా ఎస్ఈబీ డీఎస్పీగా జె.వెంకటనారాయణ బదిలీపై వస్తున్నారు. ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ ట్రాఫిక్-2 నుంచి ఇక్కడకు వస్తున్నారు. భీమవరం డీఎస్పీ బి.శ్రీనాథ్‌ను కుప్పం డీఎస్పీగా బదిలీ కాగా ఆయన స్థానంలో ఒంగోలు ఎస్‌డీపీవో వి.నారాయణస్వామి రెడ్డి రానున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా సీసీఎస్ డీఎస్పీగా కర్నూలు నుంచి ఎస్.యుగేంద్రబాబు వస్తున్నారు. తాడేపల్లిగూడెం ఎస్‌డీపీవోగా పని చేస్తున్న సి.శరత్‌రాజ్‌కుమార్‌ను చిత్తూరు జిల్లా చంద్రగిరి ఎస్‌డీపీవోగా బదిలీ చేశారు. తాడేపల్లిగూడెం ఎస్‌డీపీవోగా విశాఖ ఈస్ట్ ఎస్పీ డీఎస్ఆర్‌వీఎస్ఎన్ మూర్తి వస్తున్నారు.

ముగిసిన జేఈఈ మెయిన్స్

తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 1 : జేఈఈ మెయిన్స్ పరీక్షలు పెద తాడేపల్లి వాసవి ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం ప్రశాంతంగా ముగిశాయి. పశ్చిమ గోదావరి జిల్లాలో ఏకైక పరీక్ష కేంద్రంగావున్న వాసవి ఇంజనీరింగ్ కళాశాలలో నాలుగు రోజులుగా పరీక్షలు కొనసాగుతున్నాయి. గురువారం రెండు షిఫ్టులుగా జరిగిన పరీక్షల్లో 220 మంది విద్యార్థులకు 219 మంది హాజరయ్యారు. పరీక్షలను ప్రిన్సిపల్ డాక్టర్ రత్నాకర రావు, కో ఆర్డినేటర్ నటరాజ్ పర్యవేక్షించారు.

నేడు నరసాపురం బంద్

నరసాపురం టౌన్, ఫిబ్రవరి 1 : ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన భూహక్కు చట్టాన్ని వెంటనే రద్దు చేయాలంటూ నరసాపురం బార్ అసోసియేషన్ శుక్రవారం పట్టణ బంద్‌కు పిలుపునిచ్చింది. ఇప్పటికే ఛాంబర్ ఆఫ్ కామర్స్, విద్యా సంస్థలకు సమాచారాన్ని అందించారు. బంద్‌కు అన్ని రాజకీయ పార్టీలు, వ్యాపార వర్గాలు, ప్రజలు సహకరించాలని న్యాయవాదులు కోరారు.

విడదీయలేని అనుబంధం

గోదావరి ఎక్స్‌ప్రెస్‌కు యాభై ఏళ్లు



నరసాపురం, ఫిబ్రవరి 1: జిల్లా మీదుగా ఎన్నో ఎక్స్‌ప్రెస్‌లు నడుస్తుంటాయి. వాటిలో కొన్ని రైళ్లలో ప్రయాణించేదుకు చాలామంది ఇష్టపడుతుంటారు. అటువంటి వాటిలో గోదావరి ఎక్స్‌ప్రెస్ ఒకటి. సికింద్రాబాద్-విశాఖపట్నం మధ్య నడిచే ఈ ఎక్స్‌ప్రెస్‌తో జిల్లా ప్రయాణికులకు ఎంతో విడదీయరాని అనుబంధం ఉంది. ఇంతటి ప్రాధాన్యత కలిగిన ఈఎక్స్‌ప్రెస్‌కు గురువారంతో 50 ఏళ్ళు పూర్తయ్యాయి. ఈ ఐదు దశాబ్దాల కాలంలో ఈ ఎక్స్‌ప్రెస్ లక్షలాది మంది జిల్లా వాసులను సురక్షితంగా గమ్య స్థానాలకు క్షేమంగా చేర్చింది. దక్షిణమధ్య రైల్వే పరిధిలో నడిచే ఈ ఎక్స్‌ప్రెస్ 1974 ఫిబ్రవరి 1న పట్టాలెక్కింది. 7007 నంబర్‌తో సికింద్రాబాద్-విశాఖ మధ్య నడిచేది. 2011 వరకూ ఈ రైలు ఎక్స్‌ప్రెస్‌గానే నడుస్తుండటంతో జిల్లాలో ఏలూరు, భీమడోలు, నిడదవోలు, కొవ్వూరు స్టేషన్‌లలో ఆగేది. అయితే దీనిని సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌గా చేసి నంబర్ 12727గా మార్చారు. దీంతో ప్రస్తుతం జిల్లాలో ఏలూరు,తాడేపల్లిగూడెం స్టేషన్‌లలో మాత్రమే ఆగుతోంది. దక్షిణ మధ్య రైల్వేలో మొట్టమొదటి ఏసీ ఫస్ట్‌క్లాస్ బోగీలతో నడిచే ఎక్స్‌ప్రెస్ ఇదే కావడం గమనార్హం. అటు సికింద్రాబాద్, ఇటు విశాఖపట్నం వెళ్ళేవారు ముందుగా ఈ రైలులో వెళ్లేందుకు మక్కువ చూపుతారు.షెడ్యూల్ సమయాలకు అనుగుణంగా ఈరైలు నడవటమే దీనికి కారణం. జిల్లా వాసులతో ఎంతో అనుబంధం పెనవేసుకున్న ఈ రైలుకు నేటికి 50 ఏళ్లు నిండటంతో చాలా మంది ప్రయాణికులు తమ అనుభూతులను గుర్తు చేసుకుంటున్నారు.

సీఎం పర్యటన..వాహనాల మళ్లింపు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ మేరీ ప్రశాంతి

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 1 : ఏలూరులో 3న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి బహిరంగ సభ దృష్ట్యా ఆరోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు జిల్లా మీదుగా వెళ్లే భారీ వాహనాలను దారి మళ్ళిస్తున్నట్లు ఎస్పీ మేరీ ప్రశాంతి తెలిపారు. ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఎస్పీ వివరాలు తెలిపారు.

విశాఖపట్టణం వైపు నుంచి విజయ వాడ, చెన్నై వైపు వెళ్ళే భారీ వాహనాలను కత్తిపూడి జంక్షన్ వద్ద మళ్లించి గొల్లప్రోలు, కాకినాడ, అమలాపురం, చించినాడ బ్రిడ్జి, నర్సాపురం, మొగల్తూరు మీదుగా మళ్లించారు. పెరవలి, సిద్ధాంతం వద్ద దారి మళ్ళించిన వాహనాలు పెనుగొండ, పాలకొల్లు, నర్సాపురం, మొగల్తూరు మీదుగా తాడేపల్లిగూడెం, తణుకు వద్ద దారి మళ్ళించిన వాహనాలు భీమవరం, నర్సాపురం, మొగల్తూరు, లోసరి వంతెన మీదుగా చెన్నై వైపు వెళ్ళాలన్నారు.

విశాఖపట్టణం నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాలు దేవరపల్లి వద్ద దారి మళ్లించనున్నట్టు తెలిపారు. దేవరపల్లి, గోపాలపురం, కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం, జీలుగుమిల్లి, అశ్వారావుపేట, సత్తుపల్లి, ఖమ్మం సూర్యాపేట మీదుగా వెళ్లాలన్నారు. తాడేపల్లిగూడెం వద్ద దారి మళ్ళించిన వాహనాలను నల్లజర్ల, కొయ్యలగూడెం, జీలుగుమిల్లి, జంగారెడ్డిగూడెం మీదుగా, నారాయణపురం వద్ద దారి మళ్లించిన వాహనాలు దూబచర్ల, భీమడోలు, ద్వారకాతిరుమల, కామవరపుకోట, జంగారెడ్డిగూడెం మీదుగా వెళతాయన్నారు. హనుమాన్ జంక్షన్ నుంచి నూజివీడు, రామన్నపేట అడ్డరోడ్డు, ధర్మాజీగూడెం, చింతలపూడి, జీలుగుమిల్లి, జంగారెడ్డిగూడెం మీదుగా వెళ్ళాలన్నారు.

విజయవాడ నుంచి రాజమండ్రి వైపు వెళ్ళే చిన్న వాహనాలు సోమవరప్పాడు (జంగారెడ్డిగూడెం రోడ్డువైపు నుంచి) జోగన్నపాలెం, సీతమంపేట రైల్వే గేటు, తిరుమల డైరీ మీదుగా జాతీయ రహదారిలోకి వెళ్ళాలన్నారు. రాజ మండ్రి వైపు నుంచి విజయవాడ వైపు వెళ్ళే కార్లు, ఇతర చిన్న వాహనాలు కొవ్వలి బ్రిడ్జి నుంచి కొవ్వలి, పాలగూడెం మీదుగా మినీ బైపాస్ రోడ్డు, వట్లూరు, కలపర్రు వద్ద జాతీయ రహదారిలోకి వెళ్లాలన్నారు. అత్యవసరమైతే తప్ప ఏలూరు జాతీయ రహదారిపై, ఆశ్రం ఆసుపత్రి వైపు కాని వాహనాలు రాకూడదని సూచించారు. ఎస్‌ఈబీ అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు, ఏలూరు డీఎస్పీ శ్రీనివాసులు పాల్గొన్నారు.


బహుమతి అందజేస్తున్న ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి, తదితరులు

సౌతిండియా సైన్స్ ఫెయిర్‌లో చింతలపూడి విద్యార్థినులకు ప్రథమ బహుమతి

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 1 : దక్షిణ భారత సైన్స్ ఎగ్జిబిషన్‌లో జిల్లాకు ప్రథమస్థానం లభించింది. 8 రాష్ట్రాల్లో ఇటీవల వేర్వేరుగా నిర్వహించిన రాష్ట్రస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్లలో ఆయా విభాగాల్లో ప్రథమస్థానంలో నిలిచిన బాలబాలికలతో జనవరి 27 నుంచి గురువారం వరకు విజయవాడలోని మురళీ కన్వెన్షన్ సెంటర్‌లో సదరన్ ఇండియా సైన్స్‌ఫెయిర్- 2024 నిర్వహించారు. కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ, రాష్ట్ర విద్య, పరిశోధన, శిక్షణ మండలి (ఎస్సీఈఆర్టీ), బెంగళూరు విశ్వేశ్వరయ్య ఇండస్ట్రియల్ టెక్నలాజికల్ మ్యూజియం ఆధ్వర్యంలో దక్షిణ భారత సైన్స్ ఫెయిర్‌లో చింతలపూడి జడ్పీ హైస్కూలు విద్యార్థినులు కె.సౌమ్య, ఎం.శ్రీవర్షిణిల ప్రదర్శన జాతీయస్థాయిలో ప్రథమ బహుమతి గెలుచుకుందని డీఈవో పి.శ్యాంసుందర్ వెల్లడించారు. ఆటో మేటిక్ ఇంటర్ లాకింగ్ సిస్టం, కవచ్ సాంకేతికతను ఉపయోగించడం ద్వారా ప్రమాదాలను ఎలా నివారించవచ్చో ప్రదర్శించారు. విజేతలకు గురువారం సాయంత్రం జరిగిన ముగింపు కార్యక్రమంలో ఎస్సీఈఆర్టీ రాష్ట్ర డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి, బెంగళూరు సైన్స్ మ్యూజియం సీనియర్ సైంటిస్టు జ్యోతి నగదు బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేశారని చింతలపూడి జడ్పీ హైస్కూలు హెచ్ఎం మురళీకృష్ణ తెలిపారు. జిల్లా సైన్స్ ఆఫీసర్ చౌదరి, గైడ్‌టీచర్ కె.రవికుమార్‌లు అభినందించారు.

విద్యార్థులు సొంతంగా కంపెనీలు ఏర్పాటు చేసే స్థాయికి వెళ్ళాలి


ఆన్‌లైన్‌లో మాట్లాడుతున్న కృష్ణసౌజన్య

తాడేపల్లిగూడెం అర్బన్, ఫిబ్రవరి 1: విద్యార్థులు సొంతంగా కంపెనీలు ఏర్పాటు చేసే స్థాయికి ఎదగాలని బిజినెస్ కన్సల్టింగ్ అండ్ ట్రైనింగ్ మేనేజ్‌మెంట్ డైరక్టర్ ఎస్.కృష్ణ సౌజన్య అన్నారు. ఏపీ నిట్‌లో గురువారం ఎంటర్‌ప్రెన్యూర్ షిప్ స్కిల్స్ ఆటిట్యూడ్,బిహేవియర్ డవలప్‌మెంట్ అనే అంశంపై విద్యార్థులకు ఆన్లైన్‌లో అవగాహన నిర్వహించారు. ఆధునిక పోటీ ప్రపంచంలో రాణించాలంటే ప్రతి అంశంపై అవగాహన పెంచుకోవడంతో పాటు, సాంకేతిక నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలన్నారు. నిట్ డీన్ రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ డాక్టర్ జీఆర్‌కే.శాస్త్రి మాట్లాడుతూ సాంకేతికతను జోడిస్తే ఎన్నో అద్భుతాలను సృష్టించవచ్చునన్నారు. ఇనిస్టిట్యూట్ ఇన్నోవేషన్ కౌన్సిల్ అధ్యక్షురాలు డాక్టర్ సుదర్శన దీప, ఉపాధ్యక్షులు డాక్టర్ శంకర్,ఆచార్యులు డాక్టర్ సందీప్ పాల్గొన్నారు.


ఏలూరులో చికిత్స పొందుతున్న మధుబాబును పరామర్శిస్తున్న నేతలు

వైసీపీ దురాగతాలకు ప్రతిఫలం అందుకుంటారు

పెదవేగి, ఫిబ్రవరి 1 : వైసీపీ అరాచకాలు, దురాగతాలకు ప్రతిఫలాన్ని అందుకునే సమయం దగ్గర పడిందని మాజీ మంత్రి కొల్లు రవీంద్ర, మాజీ ఎంపీ కొనకళ్ళ నారాయణ అన్నారు. పెదవేగి మండలం లక్ష్మీపురంలో పోలవరం కుడి ప్రధాన కాలువ గట్టునుంచి మంగళవారం రాత్రి మట్టిని తవ్వి అక్రమంగా తరలిస్తున్న సమయంలో అడ్డుకున్న టీడీపీ నాయకులపై వైసీపీ మూకలు దాడిచేసిన ఘటనలో గాయపడ్డ పెదవేగికి చెందిన టీడీపీ నాయకుడు తాతా సత్యనారాయణ, ఏలూరులో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జోగన్నపాలెం సొసైటీ మాజీ చైర్మన్ పసుమర్తి మధుబాబులను గన్ని వీరాంజనేయులు, చింతమనేని ప్రభాకర్, ఘంటా మురళీరామకృష్ణతో పాటు పలువురు టీడీపీ నాయకులు పరామర్శించారు. వైసీపీ చిల్లర రాజకీయాలు చేస్తోందన్నారు. దాడులు, దౌర్జన్యాలతో భయపెట్టాలని చూస్తోందన్నారు. తాము వైసీపీలాగా పిల్ల చేష్టలకు పోమని సక్రమ మార్గంలోనే వారికి బుద్ధి వచ్చేలా చేస్తామని సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు.

ప్రమాదంలో చిత్తడి నేలలు


కొల్లేరులో సేద తీరుతున్న విదేశీ వలస పక్షులు


కొల్లేరు వ్యూ

సంరక్షించుకోకపోతే పర్యావరణానికి ముప్పు

ఆటపాకలో అటవీశాఖ ఆధ్వర్యంలో ఏటా వేడుకలు

నేడు ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవం

కైకలూరు, ఫిబ్రవరి 1: పర్యావరణాన్ని పరిరక్షించుకోకపోతే భావితరాలకు చిత్తడి నేలలు ఉండవు. ఇప్పటికే పలురకాల పక్షులు, జంతువులు, జీవ జాతులు అంతరించిపోతున్నాయి. కొన్నిరకాల జంతువులు, పక్షులు చూడాలంటే జూపార్కులోనో, ఛానల్స్‌లోనే చూడవలసి వస్తుందని, ఇదే పరిస్థితి కొన సాగితే భవిష్యత్తులో చిత్తడినేలలు కనుమరుగవుతాయని పర్యావరణ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మానవాళి మనుగడకు చిత్తడి నేలలు ఎంతో దోహదపడతాయి. సృష్టిలో సహజసిద్ధంగా ఏర్పడిన వనరులను కాపాడుకుంటే భావితరాల ప్రజలకు వాటి ఆవశ్యకత, స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించగలుగుతాం. సృష్టిలో ఉన్న అనంతకోటి జీవరాశుల్లో 40 శాతం చిత్తడి నేలల్లోనే ఉంటాయి. పక్షులకు ఈ నెలల్లో ఆహారం సంవృద్ధిగా లభిస్తుంది. వీటి ప్రాముఖ్యతను గుర్తించి వివిధ దేశాలు చిత్తడి నేలల దినోత్సవం నిర్వహిస్తున్నాయి.



చిత్తడి నేలల పరిధిలోకి కొల్లేరు

చిత్తడి నేలల ఆవశ్యకతను గుర్తించి ఇరాన్ దేశంలోని రామ్‌సార్ గ్రామంలో 1971లో జరిగిన సదస్సులో ప్రపంచంలోని అన్ని దేశాలు పాల్గొన్నాయి. ఈ సదస్సులో చిత్తడి నేలల ఆవశ్యకతను గుర్తించారు. ప్రపంచంలో ఏ దేశంలో ఉన్నా వాటిని పరిరక్షించాలని ఆయా దేశాల ప్రతినిధులు తెలి యజేశారు. అదే రోజును పురస్కరించుకొని ఫిబ్రవరి 2న ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవంగా గుర్తించి రామ్‌సర్ సైట్ అని నామకరణం చేశారు. ప్రపంచంలో పలు దేశాల్లోని చిత్తడినేలలుగా పేరొందిన వాటిని ఈ సైట్‌లోకి తీసుకున్నారు. చిత్తడి నేలల పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయా దేశాలకు వివరించారు. కొల్లేరు 2002లో రామ్‌సర్ సైట్‌లోకి తీసుకున్నారు. 2006లో కొల్లేరును అటవీశాఖ అధికారులకు అప్పగించారు. 2009 నుంచి ఆటపాక వలస పక్షుల కేంద్రంలో అటవీశాఖ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 2న ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవం నిర్వహి స్తున్నారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొంటారు. వారికి కొల్లేరు, చిత్తడి నేలల ఆవశ్యకతపై పలు పోటీలను నిర్వహిస్తారు. ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులను అందిస్తారు.

ప్రాధాన్యంపై ప్రచారం శూన్యం

ప్రతీ సంవత్సరం అటవీశాఖ ఆధ్వర్యంలో చిత్తడి నేలల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నప్పటికీ ప్రజల్లో ఈ నేలల విశిష్ఠతను తెలిపేవిధంగా ఎక్కడా కొల్లేరు పరివాహక ప్రాంతంలో ఏ విధమైన ప్రచారాలు లేవు. గతంలో డబ్ల్యుడబ్ల్యుఎఫ్ ఆధ్వర్యంలో కొన్ని కార్యక్రమాలు నిర్వహించేవారు. కానీ ఈ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి ఈ కార్యక్రమాలు డబ్ల్యుడబ్ల్యుఎఫ్ బృందం పాల్గొనడం మానేసింది. గత తెలుగుదేశం ప్రభుత్వంలో అటవీశాఖ అధి కారులు కొల్లేరు కాలువలో తాటిదోనెల పోటీలను రెండు సంవత్సరాల పాటు నిర్వహించారు. పక్షుల పండుగను జరిపి ప్రజలను తీసుకువెళ్లారు. ప్రస్తుతం ఇలాంటి కార్యక్రమాలు ఎక్కడా చేపట్టిన దాఖలాలు లేవు.ఈ నేలల అభివృద్ధికి ఒక్క రూపాయి ఖర్చు చేసిందీ లేదు. చిత్తడినేలల విశిష్ఠతను అందరికీ తెలిసేవిధంగా మరింత ప్రచారం చేస్తే వాటి విలువ తెలుస్తుందని పర్యావరణ వేత్తలు పేర్కొంటున్నారు.

> సముద్రం, నది ఇతర నీటి వనరులు కలిగిన తీరప్రాంతాల్లో తక్కువ లోతు ఉండి ఎక్కువ కాలం నీరు నిల్వ ఉండే భూములను చిత్తడి నేలలు అంటారు. పెద్దనదులు లేదా సరస్సుల వెంబడి మంచినీటి చిత్తడి నేలలు ఏర్పడతాయి.. అతిపెద్ద సరస్సుగా ప్రపంచ ప్రసిద్ధి గాంచిన కొల్లేరు సరస్సును చిత్తడి నేలలు కలిగిన భూమిగా గుర్తించారు.

అభయారణ్యం వైపుగా పులి

పాపికొండల ప్రాంతానికి తిరుగు ప్రయాణం

ఏజెన్సీ వాసులు అప్రమత్తంగా ఉండాలి

టాంటాం ద్వారా అటవీ అధికారుల హెచ్చరిక


పులి పాదముద్రలు, వెంట్రుకలను సేకరించిన అటవీశాఖ అధికారులు

బుట్టాయగూడెం, ఫిబ్రవరి 1 : వారం పది రోజులు మన్యంతో పాటు జిల్లా వాసులకు కంటిమీద కునుకు లేకుండా చేసిన పెద్దపులి అభ యారణ్యానికి తిరుగు ప్రయాణం పట్టినట్లు అటవీశాఖ అధికారులు గుర్తించారు. పులి కాలిముద్రలు, ఇనుప కంచెలను దాటుతుండగా కంచెకు ఇరుక్కుపోయిన పులి వెంట్రుకలను సేకరించారు. ప్రస్తుతం తూర్పు గోదావరి జిల్లా గోపాలపురం మండలం మాతంగమ్మమెట్ట పరిసర ప్రాంతాల్లో పులి ఉందని రాత్రికి ఏజెన్సీకి చేరవచ్చని అటవీశాఖ అధికారులు తెలియజేశారు. ముందు జాగ్రత్త చర్యగా మన్యం ప్రాంతంలోని ప్రజలను అప్రమత్తం చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా అటవీశాఖ అధికారి రవీంద్రబాబు, కన్నాపురం రేంజర్ కృష్ణకుమారి ఆదేశాల మేరకు బుట్టాయగూడెం, పోల వరం మండలాల్లోని అటవీ ప్రాంతానికి దగ్గరలో ఉన్న గ్రామాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని టాం టాం వేయించినట్లు ఎఫ్ఎస్‌వో మూర్తి, వైల్డ్‌లైఫ్ డీఆర్‌వో జె.ప్రభాకర్ తెలిపారు. మండలంలోని రాజానగరం, కొవ్వాడ, రెడ్డిగూడెం, లక్ష్మీపురం, నాగన్నగూడెం, కొత్తరాజానగరం, కామయ్య కుంట, లంకపల్లి గ్రామాలతో పాటు పోలవరం మండలంలోని ఎల్ఎన్‌డీ పేట ఇతర గ్రామాల్లో టాంటాం వేయించి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. పశువులను, మేకలను పొలాల్లో కట్టవద్దని, ప్రజలు కూడా ఒంటరిగా సంచరించవద్దని తెలిపారు.ఇప్పటికే పులి జాడను కనుగోనేందుకు మండలంలోని ముంజులూరు పంచాయతీ పరిధిలో ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. అభయారణ్యం నుంచి ముందుగా అటవీ ప్రాంతంలోకి ప్రవేశించిన పులి బుట్టాయగూడెం మండలంలోని ముంజు లూరు, రెడ్డికోపల్లె ప్రాంతాల్లో ఆవును, మేకను చంపి తినేసింది. తర్వాత కొయ్యలగూడెం, గోపాలపురం, నల్లజర్ల, పెదవేగి, ద్వారాకతిరుమల మండలాల్లో సంచరించి ఆవుదూడను చంపివేసింది. అభయారణ్యం వైపు వెళుతోందనే విషయం తెలియగానే ప్రజలతో పాటు అధికారులు ఊపిరి పీల్చుకుంటున్నారు.

మాతంగమ్మ మెట్ట వద్దకు..

గోపాలపురం : నిన్న మొన్నటి వరకు ద్వారకాతిరుమల, నల్లజర్ల మండలాల్లోని అడవుల్లో సంచరించిన పెద్దపులి గురువారం ఉద యానికి దేవరపల్లి మండలం యాదవోలు, చిన్నాయిగూడెం గ్రామాల మధ్య సంచరించినట్లు అటవీ శాఖాధికారులు గుర్తించారు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో యాదవోలు రెవెన్యూ పరిధి దాటి వాదాలకుంట గ్రామ శివారులో ఉన్న గాడిచెరువు సమీపంలోని గద్దే ఈశ్వరుడుకు చెందిన పొగాకు తోటలో పెద్దపులి జాడలు కనపడటంతో రైతులు భయంతో ఇళ్లకు చేరుకున్నారు. ఈ విషయాన్ని అటవీ శాఖాధికారులకు తెలపడంతో పులి అడుగుజాడలు వెంబడిస్తూ సాయంత్రానికి కరిచర్లగూడెం, కోమటిగుంట గ్రామాల మధ్యలో ఉన్న మాతంగమ్మ మెట్ట వెనుకభాగంలో పెద్దపులి ఉన్నట్లు అటవీ శాఖాధికారులు గుర్తించారు. కరిచర్లగూడెం, కోమటిగుంట, వాదాలకుంట, వెదుళ్ళకుంట, జగన్నాధపురం, కరగపాడు, బుచ్చయ్యపాలెం గ్రామాల్లో సాయంత్రం 5 గంటలు దాటితే ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావద్దంటూ టాంటాం వేయించారు. తూర్పుగోదావరి జిల్లా ఫారెస్ట్‌రేంజ్ అధికారి ధర్మరాజు ఇచ్చిన వివరాల ప్రకారం పది రోజులుగా సంచరిస్తున్న పెద్దపులిని వెంబడిస్తున్నామని గురువారం సాయంత్రానికి కరిచర్లగూడెం, కోమటిగుంట గ్రామాల మధ్యలో ఉన్న మాతంగమ్మమెట్ట వద్దకు పెద్దపులి చేరినట్లు గుర్తించామన్నారు. తమ అంచనా ప్రకారం కరగపాడు మీదుగా పోలవరం పాపికొండల ప్రాంతానికి వెళ్లవచ్చని భావిస్తున్నట్లు తెలిపారు.

యాదవోలులో కలకలం

దేవరపల్లి : దేవరపల్లి మండలం యాదవోలులో పెద్దపులి అడుగుజాడలు కనిపించడంతో గ్రామస్థులు, రైతుల్లో భయం, ఆందోళన మొదలయ్యాయి. గురువారం యాదవోలులో పొగాకు తోటల్లో పులి అడుగులు కనిపించాయని ఈ అడుగులు గోపాలపురం మండలం మాతంగమ్మమెట్ట, జగన్నాధపురం వైపు వెళ్లినట్లు రైతులు చెబుతున్నారు.

తాడిపూడి ఇసుక ర్యాంపులో చిరుతపులి



తాళ్ళపూడి : తాళ్ళపూడి మండలం తాడిపూడి ఇసుక ర్యాంప్‌లో గురువారం చిరుతపులి సంచరిస్తున్నట్లు పలువురు గుర్తించారు. గోదావరి తీరం వెంబడి నడుచుకుంటూ వెళ్లడాన్ని అక్కడ పనిచేసే సిబ్బంది చూసి భయభ్రాంతులకు గురై పక్కనే ఉన్న షెడ్డులో దాక్కున్నారని తెలిపారు. దూరం నుంచే నడుచు కుంటూ వెళ్లిన దృశ్యాన్ని వీడియోలో బంధించారు. చిరుతపులి తాళ్ళపూడి గ్రామం వైపుగా వెళ్లిందని చెప్పడంతో గోదావరి తీర ప్రాంత వాసులు కాస్త జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిస్తున్నారు.

20 నుంచి లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాలు



ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 1: సుందరగిరిపై స్వయం వ్యక్తునిగా కొలువైన లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ఈనెల 20 నుంచి 25 వరకూ కల్యాణ మహోత్సవాలు జరుగనున్నాయని ఆలయ ఈవో వేండ్ర త్రినాధరావు తెలిపారు. శ్రీవారి ఆలయానికి దత్తత దేవాలయమై మండలంలోని ఐఎస్ జగన్నాధపురంలో కొలువైన స్వామివారి ఉత్సవాల్లో భాగంగా ఈనెల 20న ఉదయం 10 గంటలకు స్వామివారిని, అమ్మవార్లను పెండ్లికుమారుడు, పెండ్లి కుమా ర్తెలుగా చేస్తారు. సాయంత్రం ధ్వజారోహణ జరుగుతుందన్నారు. 21న నిత్య హోమాలు, మూల మంత్ర హవనాలు, 22న ఉదయం 11-10 గంటలకు స్వామివారి కల్యాణం జరుగుతుందన్నారు. 23న నిత్యహోమాలు, మూల మంత్ర హవనాలు, గ్రామోత్సవం జరుగుతుందన్నారు. 24న శ్రీచందనోత్సవం, ధ్వజఅవరోహణ, 25 శ్రీపుష్ప యాగంతో ఉత్సవాలు పరిసమాప్తమవుతాయని తెలిపారు.

నష్టం వస్తోంది .. నా వల్ల కాదు

దేవస్థానం టోల్‌గేట్ నిర్వహణ వదిలేసిన కాంట్రాక్టర్


సిబ్బంది లేకపోవడంతో కొండపైకి వెళ్తున్న వాహనాలు

ద్వారకా తిరుమల, ఫిబ్రవరి 1: మరో ఏడాది కాలం గడువు ఉండగానే టోల్‌గేట్ నిర్వహణ సంబంధిత కాంట్రాక్టర్ వదిలేశారు. మొదటి ఏడాది నష్టం వచ్చిందని చెబుతూ దానిని అర్ధంతరంగా తప్పుకున్నారు. రెండేళ్ల కాలానికి గాను జరిగిన వేలంపాటలో ఏడాది క్రితం శ్రీనివాస రావు అనే కాంట్రాక్టర్ టోల్ వసూలు చేసుకునే హక్కును ఏడాదికి రూ.1.70 కోట్లకు కైవసం చేసుకున్నాడు. నిబంధనల ప్రకారం రెండో ఏడాది 10 శాతం మేర పెంచి మొదటి ఏడాది పూర్తి కావడానికి మూడు నెలల ముందే ఆ మొత్తాన్ని దేవస్థానానికి చెల్లించాల్సి ఉంది. ఒకే విడతగా చెల్లించాల్సి ఉండగా మొదటి ఏడాది మొత్తాన్ని నాలుగు విడతలుగా చెల్లించినట్లు చెబుతున్నారు. జనవరి 31న మొదటి ఏడాది పూర్తవగానే జీఎస్టీ కారణంగా నష్టపోతున్నానని ఇకపై నిర్వహణ సాధ్యం కాదని, తనిచ్చిన డిపాజిట్ సొమ్ము రూ.10 లక్షలు చెల్లించాలని దేవస్థానానికి అర్జీ పెట్టుకుని గురువారం నిర్వహణ బాధ్యతల నుంచి తప్పుకున్నాడు. దీంతో దేవస్థానం సిబ్బందిని ఏర్పాటు చేశారు. ఈవో వేండ్ర త్రినాధరావు మాట్లాడుతూ కాంట్రాక్టర్‌పై టెండర్ షరతుల ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. రెండో ఏడాది అద్దె మొత్తం మొదటి ఏడాది ముగిసేందుకు మూడు నెలల ముందే వసూలు చేయాల్సి ఉందన్నారు. ఎందుకు వసూలు చేయలేదో విచారణ జరిపి సంబంధిత అధికారులపై చర్యలు చేపడతామన్నారు.

సచివాలయంలో రిజిస్ట్రేషన్లు పరిశీలించిన రిజిస్ట్రార్



ఆచంట,ఫిబ్రవరి 1: ప్రభుత్వం ఇచ్చిన పట్టాలు రిజిస్ట్రేషన్ నిమిత్తం ఇటీవల సచివాలయంలో రిజిస్ట్రేషన్‌లు చేసేందుకు జీవో జారీ చేయడంతో ఆయా సచివాలయాల్లో రిజిస్ట్రేషన్‌లు ప్రారంభించారు. ఇందులో భాగంగా జిల్లా రిజిస్ట్రార్ ఆర్.సత్యనారాయణ శుక్రవారం ఆచంట సచివాలయంలో రిజిస్ట్రేషన్ విధానాన్ని పరిశీలించారు. తొందరగా జిల్లాలోని అన్ని సచివాలయాల్లో రిజిస్ట్రేషన్‌ను పూర్తిచేయాలని ఆదేశించారు. ఆచంట సబ్ రిజిస్ట్రార్ ఎస్.కమల కుమారి, పంచాయతీ కార్యదర్శి నాగబాబు, వీఆర్‌వో సీతారామ్ పాల్గొన్నారు.


విజిలెన్సు అధికారులు సీజ్ చేసిన వేప, ఆముదం పిండి

ఐదు లక్షల విలువైన వేప, ఆముదం పిండి సీజ్

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 1 : ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇతర రాష్ట్రాల నుంచి ఆముదపు పిండి దిగుమతి చేసి విక్రయిస్తున్న ఒక వ్యక్తిపై విజిలెన్సు అధికారులు కేసు నమోదు చేశారు. జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ కరణం కుమార్‌కు అందిన సమాచారంతో ఆయన ఆదేశాల మేరకు విజిలెన్స్ సీఐ విల్సన్, ఏవో సురేష్ కుమార్, అగ్రికల్చరల్ అధికారి పవన్, రెవెన్యూ అధికారులు గురువారం కామవరపుకోట గ్రామంలోని కర్షక్ ఆగ్రో ఇండస్ట్రీస్‌పై దాడి చేశారు. అక్కడ 50 వేల 441 మెట్రిక్ టన్నుల వేప పిండి, ఆముదం పిండి ఉండడాన్ని గుర్తించారు. ఎటు వంటి లైసెన్సులు లేకుండా అక్రమంగా తయారు చేసి నిల్వ చేసి అమ్ముతున్నట్లుగా గుర్తించారు. ఇండస్ట్రీస్ యజమాని ఉదయ్ కుమార్‌ను అధికారులు ప్రశ్నించగా పొగాకు సూర, వేప గింజలతో వేప పిండి తయారు చేసి గుజరాత్ రాష్ట్రం కేదార్ జిల్లా నుంచి ఆముదపు పిండి తీసుకువచ్చి రైతులకు అమ్ముతున్నట్లుగా వెల్లడించారు. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా విక్రయించడంతో అతనిపై బయో ఫెర్టిలైజర్ అండ్ ఆర్గానిక్ ఫెర్టిలైజర్ కంట్రోల్ ఆర్డర్ 1985 (8)(19) నిబంధనల మేరకు కేసు నమోదు చేశారు. అక్కడ ఉన్న వేప, ఆముదపు పిండి విలువ ఐదు లక్షల 83 వేల 100 రూపాయలు ఉంటుందని గుర్తించి వాటిని సీజ్ చేశారు.

రైల్వే గేటు ట్రాక్‌పై దిగబడిన ట్రాక్టర్

ఉంగుటూరు, ఫిబ్రవరి 1 : మండల కేంద్రమైన ఉంగుటూరు రైల్వే గేటు మధ్యలో తాటి పట్టెలతో వెళుతున్న ట్రాక్టర్ గురువారం రాత్రి దిగబడిపోయింది. ఈ విషయమై స్థానికులు అప్రమత్తమై ట్రాక్టర్‌ను ట్రాక్ నుంచి తప్పించారు. దీంతో ఇదే సమయంలో కాకినాడ నుంచి తిరుమల వెళుతున్న రైలును పదిహేను నిమిషాల సేపు ఆపాల్సి వచ్చింది.

క్రైం కార్నర్

గుర్తుతెలియని వాహనం ఢీకొని తాపీమేస్త్రి మృతి

న్యాయం చేయాలని బంధువుల ధర్నా



తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 1: గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన చినతాడేపల్లి రోడ్డులో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కడియద్దకు చెందిన తాపీపని చేసే నరెడ్ల చంద్రశేఖర్ (35) గురువారం తాడేపల్లిగూడెంలో బంధువుల ఇంట్లో ఫంక్షన్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా చినతాడేపల్లి రోడ్డు వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో చంద్రశేఖర్ తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కడియద్దకు చెందిన బంధువులు మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నాకు దిగారు. సీసీ కెమేరాల ద్వారా ఢీకొన్న వాహనాన్ని గుర్తించి న్యాయం చేస్తామని ఎస్ఐ సురేష్ హామీ ఇవ్వడంతో బంధువులు ఆందోళన విరమించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

జంగారెడ్డిగూడెం, ఫిబ్రవరి 1 : రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. జనవరి 31వ తేదీన మండలంలోని తాడువాయి సెంటర్‌లో అప్పలరాజుగూడెంకు చెందిన గన్నిన వీరవెంకట కృష్ణారావు (65) రోడ్డుపై గాయాలతో పడి ఉండటాన్ని అటుగా వెళుతున్న నారి నాగరాజు అనే వ్యక్తి గుర్తించి కృష్ణారావు కుమారుడు గన్నిన సురేంద్రప్రసాద్‌కు తెలిపాడు. తన తండ్రిని ఆసుపత్రికి తీసుకువెళ్లమని చెప్పగా నాగరాజు వెంటనే కృష్ణారావును జంగారెడ్డిగూడెం ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించాడు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం రాజమండ్రి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. గుర్తు తెలియని వాహనం ఢీకొని వెళ్లిపోవడంతో తీవ్రంగా గాయపడి తన తండ్రి మృతి చెందినట్లు సురేంద్ర ప్రసాద్ తెలిపారు.ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ మంగయ్య తెలిపారు.

పలివెలలో రోడ్డు ప్రమాదం...ఇద్దరి మృతి

ఆచంట, ఫిబ్రవరి 1: కొత్తపేట మండలం పలివెల గ్రామం చౌదరి పురం సత్తెమ్మ తల్లి గుడి వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురు మృతి చెందారు. స్థానికుల కథనం ప్రకారం ఆచంటకు చెందిన ఆటోడ్రైవర్ బండి మోషె, రావులపాలెం మండలం ముమ్మిడివరప్పాడుకు చెందిన చీమల మాధవరావు మోటారు సైకిల్‌పై వస్తుండగా ఎదురెదురుగా వస్తున్న ఆటో ఢీకొనడటంతో ఇరువురు మృతి చెందారు. మరొక వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. చీమల నరసింహరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

మోటారు సైకిల్‌పై నుంచి పడి ఒకరి మృతి

భీమడోలు, ఫిబ్రవరి 1 : మోటారు సైకిల్ అదుపు తప్పి వ్యక్తి మృతి చెందినట్టు భీమడోలు ఎస్ఐ సుధాకర్ తెలిపారు. గురువారం ఉదయం 11 గంటల సమయంలో ద్వారకా తిరుమల మండలం తిరుమలంపాలెం గ్రామానికి చెందిన పంతగాని రాయప్ప (40) పల్సర్ మోటారు సైకిల్‌పై దెందులూరు మండలం గండేవారిగూడెం గ్రామంలో ఉన్న తన భార్యను తీసుకురావడానికి వెళ్తుండగా పోలసానపల్లి డంపింగ్ యార్డు సమీపంలో అదుపు తప్పి పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనంలో ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు పోలీసులు గుర్తించారు.

ఏటీఎం కార్డు మోసం .. రూ.70 వేలు విత్‌డ్రా

జంగారెడ్డిగూడెం, ఫిబ్రవరి 1 : ఏటీఎం కార్డును మార్చి ఒక మహిళను మోసం చేసిన సంఘటనపై జంగారెడ్డిగూడెం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. ఏఎస్ఐ మంగయ్య తెలిపిన వివరాలు ప్రకారం జంగారెడ్డిగూడెం యూనియన్ బ్యాంకులో మైసన్నగూడానికి చెందిన పుట్టా సునీతకు ఉన్న అకౌంట్ నుంచి 25వ తేదీన ఏటీఎం ద్వారా నగదు తీసుకునేందుకు వెళ్లగా, చదువు రాకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తి సహాయం అడిగింది. సహాయం చేసినట్లుగా నటించిన ఆ వ్యక్తి ఆమె ఏటీఎం కార్డును మార్చి ఇచ్చాడన్నారు. అనంతరం ఆదే రోజు రాత్రి 7 గంటల నుంచి 26వ తేదీ ఉదయం 3 గంటల మధ్య రూ.70 వేలు విత్‌డ్రా చేశాడన్నారు. మోసం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని సునీత భర్త సుధాకర్ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ మంగయ్య తెలిపారు.

భర్త అదృశ్యం.. భార్య ఫిర్యాదు

ఆకివీడు, ఫిబ్రవరి 1: తన భర్త కనబడడం లేదంటూ భార్య ఫిర్యాదు మేర ఎస్ఐ బత్తిన నాగబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆకివీడు కోనూరివీధికి చెందిన టైలర్ షేక్ బాజీ (46) బుధవారం నుంచి కనబడక పోవడంతో చుట్టుపక్కల గ్రామాల్లో గాలించారు. కనిపించక పోవడంతో గురువారం పోలీస్ స్టేషన్‌లో భార్య ఇచ్చిన ఫిర్యాదు మేర ఎస్ఐ కేసు నమోదు చేశారు.

మోటారు సైకిళ్ళు ఢీ.. ఒకరికి గాయాలు

ఆకివీడు, ఫిబ్రవరి 1: చినకాపవరంలో ఎదురెదురుగా మోటారు సైకిళ్ళు ఢీకొనడంతో ఒక వ్యక్తికి గాయాలయ్యాయి. గురువారం పెదకాపవరం నుంచి చినకాపవరం వెళ్ళుతున్న కుప్పల మావుళ్ళును పెదకాపవరం వైపు వెళుతున్న వ్యక్తి వేగంగా ఢీకొని వెళ్ళిపోయాడు. మావుళ్లు కాళ్ళు, చేతులకు గాయాలయ్యాయి. ఎస్ఐ కేసు నమోదు చేశారు.

ఇంకా తప్పుల తడకలే..

చింతలపూడి, ఫిబ్రవరి 1 : ఓటర్ల జాబితా కోసం ప్రత్యేక క్యాంపులు పెట్టినా తప్పుల తడక మాత్రం మారలేదు. మరణించినవారు, డబుల్ ఎంట్రీలతో తికమక పడుతున్నారు. ఓటర్ల జాబితాలు తిరగేస్తే మరణించిన వారిపేర్లు తొలగించలేదు. డబుల్ ఎంట్రీలు మార్పు చేయలేదు. చింతలపూడి నగర పంచాయతీలోని పాతచింతలపూడిలోని 14వ వార్డులో 614 ఓటరు గట్టు చినగోపయ్య, 1173 ఓటరు పోతిరెడ్డిపల్లి లింగమ్మ, 53వ నెంబరు ఓటరు చలమాల ప్రవీణ్‌లు చనిపోయినా ఓట్లు తొలగించలేదు. ఇదే వార్డులో డబుల్ ఎంట్రీలు ఉన్నాయి. 484, 158 ఓటర్లలో తలారి ఝాన్సీ పేరు రెండు సార్లు నమోదైంది. సత్తెనపల్లి నాగ ప్రసన్నకుమార్ అనే ఓటరు 147, 148లో డబుల్ ఎంట్రీగా నమోదై ఉన్నాయి.

వెల్డింగ్ వర్క్స్‌కు స్థలం కేటాయింపు

ఆచంట, ఫిబ్రవరి1: చేతి వృత్తి పనులకు వెల్డింగ్, ఇండస్ట్రీస్ వర్కులు పని చేసేందుకు గాను దుర్గాదేవి వెల్డింగ్ వర్క్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆచంటలో స్థలం కేటాయించాలని ఎమ్మెల్యే రంగనాథరాజును కోరగా ఎమ్మెల్యే స్పందించి ఆచంట సమీపంలో 25 సెంట్లు స్థలాన్ని వీరికి ఇస్తున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా ఎమ్మెల్యే శుక్రవారం వారికి కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కోట సరోజిని, పెచ్చెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

- పెనుమంచిలి ఇసుక గరువుకు రోడ్డు నిర్మాణం పనులు చేపట్టాలని గ్రామానికి చెందిన ప్రజలు ఎమ్మెల్యే రంగనాథరాజుకు విజ్ఞప్తి చేశారు. స్పందించిన ఎమ్మెల్యే తక్షణం రోడ్డును పరిశీలించి వెంటనే రోడ్డు పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆచంట, ఫిబ్రవరి 1: విద్యుత్ మరమ్మతులు కారణంగా ఆచంటలోని కౌరుపాలెం, మానేవారిపాలెం కాపులపాలెం, కచేరి సెంటర్, చినపేట, పెదపేట, ఏరియాల్లో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు నరసాపురం ఎలక్ట్రికల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి. సురేష్ కుమార్ తెలిపారు.

కుష్ఠు వ్యాధిగ్రస్తులను ఆదరించాలి


ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

భీమవరం టౌన్, ఫిబ్రవరి 1: కుష్ఠు వ్యాధి గ్రస్తులను ఆదరించి మానవత్వాన్ని చాటుకోవాలని సంస్కార్ స్కూల్ వైస్ ప్రిన్సిపాల్ వి.కుమారి అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో సంస్కార్ స్కూల్ విద్యార్థులతో జాతీయ కుష్ఠు వ్యాధి నివారణ అవగాహన ర్యాలీ, అంటరానితనం నిర్మూలన ప్రతిజ్ఞ నిర్వహించారు. రీడర్స్‌ఫోరం అధ్యక్షుడు అరసవల్లి సుబ్రహ్మణ్యం, ఎస్ కే చాన్ బాషా పాల్గొన్నారు.

ట్యాంకర్లతో తాగునీటి సరఫరా


డీకే వల్లి గ్రామస్థులకు తాగునీరు అందిస్తున్న దృశ్యం

గణపవరం, ఫిబ్రవరి 1: స్వచ్ఛమైన తాగునీరు లభించక ఇబ్బంది పడుతున్న డీకే.వల్లి గ్రామస్థులకు ఉంగుటూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి పచ్చమట్ల ధర్మరాజు ఆధ్వర్యంలో తాగునీరు సరఫరా చేపట్టారు. కార్యకర్తలు ధర్మరాజు దృష్టికి సమస్యను తీసుకువెళ్లగా స్పందించి లక్ష్మీనారాయణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 6వరోజు తాగునీరు పంపిణీ చేశారు. జనసేన నాయకులు ములసమ్మ, బండి శ్రీను, గణపతి తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు ఐరన్ మాత్రల పంపిణీ



గణపవరం, ఫిబ్రవరి 1: గణపవరం మండలం కాశీపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గురువారం ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు పంపిణీ చేశారు. వైద్య ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయులు ప్రసాద్ ఈ మాత్రలను విద్యార్థులకు వేశారు. రక్తహీనత లోపం వల్ల అలసట, మందబుద్ధి, తదితర అనారోగ్యాలు వస్తాయన్నారు. ఆరోగ్య సహాయకుడు నామాలరాజు, ఏఎన్ఎం శివకుమారి పాల్గొన్నారు

కొత్తపేటకు ఎంపీడీవో బదిలీ

ఆకివీడు, ఫిబ్రవరి 1:రానున్న ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఎంపీడీవో కందుల వాణి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కొత్తపేటకు బదిలీ అయ్యారు. నూతన ఎంపీడీవో వచ్చే వరకూ సూపరింటెండెంట్ శ్రీకర్ ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

ఘంటసాలకు తహసీల్దార్ బదిలీ

ఆకివీడు, ఫిబ్రవరి 1:తహసీల్దార్ నడింపల్లి భారతి విజయలక్ష్మి ఉమ్మడి కృష్ణాజిల్లా మచిలీపట్నం దగ్గర ఘంటసాలకు బదిలీ అయ్యారు. రానున్న ఎన్నికల ప్రక్రియలో భాగంగా తహసీల్దార్ విజయలక్ష్మి శుక్రవారం రిలీవ్ అవుతున్నారు.

వాహన చోదకులకు కంటి పరీక్షలు


కంటి వైద్య శిబిరంలో డాక్టర్లు, ఆర్టీవో అధికారులు

భీమవరం క్రైం, ఫిబ్రవరి 1 : వాహన చోదకులు కంటి చూపు పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా రవాణా అధికారి టి.ఉమామహేశ్వరరావు అన్నారు. 35వ జాతీయ భద్రత వారోత్సవాల్లో భాగంగా సూర్యమిత్ర ఎగ్జిమ్ ప్రైవేట్ లిమిటెడ్, మ్యాక్సివిజన్ కంటి హాస్పిటల్ సహకారంతో వాహన చోదకులకు గురువారం జిల్లా రవాణాశాఖ అధికారి కార్యాలయంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 86 మందికి కళ్ళ జోళ్ళు అవసరమని పరీక్షల్లో తేలింది. కార్యక్రమంలో భీమవరం మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ వెంకట రమణ, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎం.రవికుమార్, యస్ఎల్ఎస్ లక్ష్మీ పాల్గొన్నారు.

పిప్పళ్ళ ప్రసాద్‌కు సన్మానం

భీమవరం ఫిబ్రవరి 1 : యునైటెడ్ థియోలాజికల్ రీసెర్చి యూనివర్సిటీ కాలిఫోర్నియా (యూఎస్ఏ) ఇటీవల పిప్పళ్ళ ప్రసాద్‌కు డాక్టరేట్ ఇచ్చిన సందర్భంగా భీమవరం పట్టణ మంగళ వాయిద్య కళాకారుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఆధ్యాత్మిక సంగీత గురూజీ ప్రసాద్, మంగళ వాయిద్య కళాకారుల సంఘం అధ్యక్షుడు తాడి మావుళ్లు, చీపురుపల్లి రాంపండు, అలిగోలు రాంబాబు, రాజన్ శివ పాల్గొన్నారు

చురుగ్గా ఉపాధి పనులు



మొగల్తూరు, ఫిబ్రవరి 1: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పంటబోదె తవ్వకం పనులు చురుగ్గా సాగుతున్నాయి. మొగల్తూరు పంచాయతీ పరిధి నక్కావారిపాలెం, ఇంజేటివారిపాలెం, పాలకమ్మచెరువు, కెపిపాలెం నార్త్, సౌత్‌లోని పంట బోదె పనులు చురుగ్గా సాగుతున్నాయి. గురువారం కెపిపాలెం నార్త్‌లో జంగిల్ చానల్‌లో గుర్రపు డెక్క తొలగించే పనులు చేపట్టారు.

ఎంపీడీవోకు బదిలీ సన్మానం

పాలకొల్లు రూరల్, ఫిబ్రవరి 1: పాలకొల్లు ఎంపీడీవో సంగాని వెంకటేశ్వరరావు తూర్పుగోదావరి జిల్లా బదిలీ అయ్యారు. దీంతో గురువారం పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది ఆయనను సన్మానించారు. ఈవోపీఆర్‌డీ వైభవతి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ఎంఈవోలు వీరాస్వామి, ఆర్ఎస్‌వి. గంగాధర్, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, కార్యదర్శులు లింగం సత్యనారాయణ, డిఎస్.పద్మాజీరావుపాల్గొన్నారు.

నరిసేకు పురందేశ్వరి పరామర్శ



తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 1: బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు నరిసే సోమేశ్వరరావును ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి గురువారం పరామర్శించారు. ఇటీవల సోమేశ్వరరావు తండ్రి అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. ఆమె వెంట రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాశీ విశ్వనాథరాజు, రాష్ట్ర కార్యదర్శి భూపతిరాజు శ్రీనివాస వర్మ, జిల్లా అధ్యక్షుడు నార్ని తాతాజీ, తాడేపల్లిగూడెం నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజీ పాల్గొన్నారు.









పెనుగొండలో పితానికి హారతి ఇస్తున్న మహిళ.. పాలకొల్లులో రైతుపోరుబాట కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నిమ్మల.. నరసాపురంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి పొత్తూరి.. కాళ్ళలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే రామరాజు

‘మెగా డీఎస్సీ పేరుతో జగన్ ప్రభుత్వం మోసం’

పెనుగొండ, ఫిబ్రవరి 1:మెగా డీఎస్సీ పేరిట యువతను జగన్ రెడ్డి ప్రభుత్వం మోసం చేస్తున్నదని మాజీ మంత్రి పితాని సత్యనారాయణ అన్నారు. గురువారం ఇందిరా శాంతినగర్, మారెమ్మగూడెం, దొంగగూడెం, నగరేశ్వరస్వామి కాలనీ ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి అత్యధిక ఓట్లు మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 ఎన్నికల ముందు జగన్మోహన రెడ్డి 23 వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని మన ప్రభుత్వం అధికారంలోకి వస్తే మెగా డీఎస్సీ నిర్వహిస్తామని ఎన్నికల హామీ ఇచ్చారని అయితే గత నాలుగున్నర ఏళ్ళుగా డీఎస్సీ నిర్వహించలేదన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నక్కా శ్యామలా సోనిశాస్త్రి, మాజీ ఎమ్మెల్సీ మల్లుల లక్ష్మీనారాయణ, పిల్లి సత్తిరాజు, కటికిరెడ్డి నానాజీ, వేండ్ర రాము, రొక్కాల సురేష్ బాబు మండా ప్రసాద్, వెలిచేటి బాబూ రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

నియంతృత్వ పాలనకు స్వస్తి పలుకుదాం..

కాళ్ళ, ఫిబ్రవరి 1 : వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలో దుర్మార్గపు, రాక్షస పాలన సాగిస్తున్నదని, ఇటువంటి నియంతృత్వ పాలనకు స్వస్తి పలకాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎమ్మెల్యే మంతెన రామరాజు అన్నారు. కాళ్ళ గ్రామంలో ఇంటింటికి టీడీపీ, బాబుతో భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం గురువారం నిర్వహించారు. తొలుత ఇంటింటికి వెళ్ళి సమస్యలను తెలుసుకోవడంతో పాటు పెరిగిన విద్యుత్ చార్జీలు, గ్యాస్ ధరలు, ఇంటి, చెత్త పన్ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు జివి నాగేశ్వరరావు, బండారు వేణుగోపాలరావు, కోటి పాండురంగారావు, తోట పణిబాబు, మాజీ ఎంపీపీ ఆరేటి తాత పండు, గ్రామాధ్యక్షుడు కొప్పినీడి గణపతి, ఉపసర్పంచ్ పన్నాసి అబ్బులు పాల్గొన్నారు.

నేటి నుంచి రైతు పోరుబాట

పాలకొల్లు టౌన్, ఫిబ్రవరి 1: జగన్ ఐదేళ్ల పాలనలో అన్నదాతకు అన్నీ అరిష్టాలేనని ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు అన్నారు. పాలకొల్లు కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నియోజకవర్గంలోని రైతులతో కలిసి ఫిబ్రవరి 2నుంచి మూడు రోజులు పాటు రైతు పోరుబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే రామానాయుడు తెలిపారు. ఈమేరకు టీడీపీ, జనసేన నాయకులతో కలిసి రైతు పోరుబాట కరపత్రాలను విడుదల చేశారు. శివదేవుని చిక్కాల నుంచి ఈ రైతు పోరుబాట కార్యక్రమాన్ని ప్రారంభించి పాలకొల్లు, పోడూరు, యలమంచిలి మండలాల్లో మూడు రోజులు పాటు నిర్వహిస్తున్నామన్నారు. సమావేశంలో రాష్ట్ర టీడీపీ కార్యదర్శి పెచ్చెట్టి బాబు, జనసేన రాష్ట్ర నాయకుడు శిద్దిరెడ్డి అప్పారావు, టీడీపీ మండలాధ్యక్షులు గొట్టుముక్కల సూర్యనారాయణరాజు పాల్గొన్నారు.

వైసీపీని ఓడించడమే లక్ష్యం

నరసాపురం, ఫిబ్రవరి 1: రానున్న ఎన్నికల్లో వైసీపీని ఓడించడమే లక్ష్యంగా పని చేయాలని పార్టీ శ్రేణులకు ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు, కొవ్వలి నాయుడు పిలుపునిచ్చారు. గురువారం పార్టీ కార్యాలయంలో క్లస్టర్లు, యూనిట్ ఇన్‌చార్జిలు, బూత్ కన్వీనర్లకు శిక్షణ కార్యక్రమంలో వీరు మాట్లాడుతూ పొత్తులో భాగంగా సీటు ఎవరికిచ్చినా.. అంతా ఐక్యంగా పని చేద్దామన్నారు. ప్రతి పోలింగ్ బూత్‌లో ఓటర్ల లిస్టులపై దృష్టి సారించాలన్నారు. పార్టీ నాయకులు జక్కం శ్రీమన్నారాయణ, కొల్లు పెద్దిరాజు, వాతాడి ఉమా, పాలూరి బాబ్జీ, వెంకటేశ్వరావు, హరికృష్ణ పాల్గొన్నారు.

గ్రామాల్లో బేటీ బచావో బేటీ పడావో


వీరవాసరంలో బాలికలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

భీమవరం రూరల్, ఫిబ్రవరి 1 : కొవ్వాడ ప్రాథమిక పాఠశాలలో బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమాలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పి.వరలక్ష్మి విద్యార్థులకు చదువుతో పాటు పలు విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వీరవాసరం: వీరవాసరం పెద దళితపేట అంగన్వాడీ కేంద్రంలో గురువారం బేటీ బచావో బేటీపడావో కార్యక్రమాన్ని నిర్వహించారు. కిషోర్ బాలికలకు ఆడపిల్లలను రక్షిద్దాం.. ఎదగనిద్దాం.. చదివిద్దాం నినాదంపై వివరించారు. వారికి వ్యక్తిగత పరిశుభ్రత విద్యఆవశ్యకత, మంచి, చెడు ప్రవర్తనలు, ఆహార ఆరోగ్య విషయాలపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి.కనకమహాలక్ష్మి, హైస్కూల్ హెచ్ఎం ఎన్.ప్రసాద్‌బాబు, అంగన్వాడీలు పి.నాగరత్నం, బి.గంగాభవాని, ఎం.శాంతకుమారి, జి.మంగమ్మ, జె.జెస్సీరాణి పాల్గొన్నారు.

ఆసరా చెక్కుల పంపిణీ


ఆసరా చెక్కు అందిస్తున్న చీఫ్ విప్ ముదునూరి

నరసాపురం రూరల్, ఫిబ్రవరి 1:చామకూరిపాలెంలో మహిళలకు ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు ఆసరా చెక్కును అందించారు. కార్యక్రమంలో ఓబీసీ చైర్మన్ వీరన్న, ఎంపీపీ సోని, ఎంపీడీవో రమణారావు పాల్గొన్నారు.

సొసైటీలో ఎరువులు, విత్తనాలు

నరసాపురం రూరల్, ఫిబ్రవరి 1: సీతారాంపురం నార్త్ సొసైటీలో రైతులకు ఎరువులు, విత్తనాలు, పురుగుల మందులు సిద్ధంగా ఉన్నట్లు సొసైటీ అధ్యక్షుడు పులపర్తి ప్రతాప్ తెలిపారు. సొసైటీ పరిధిలో 2700 మంది సభ్యులు ఉన్నారు. 1500 మంది రైతులకు వివిధ వ్యవసాయ రుణాలను అందిస్తున్నామన్నారు.

కాంగ్రెస్ టిక్కెట్‌కు దరఖాస్తు

నరసాపురం, ఫిబ్రవరి 1: కాంగ్రెస్ పార్టీ తరుపున అసెంబ్లీ స్థానానికి పోటీ చేసేందుకు అవకాశం ఇప్పించాలని ఆపార్టీ ఇన్‌చార్జి కానూరి బుజ్జీ కోరారు. ఈమేరకు గురువారం ఆయన విజయవాడలో ఏపీ కాంగ్రెస్ కమిటీకి దరఖాస్తు చేసుకున్నారు.

రూరల్ సొసైటీ చైర్మన్‌కు పితృ వియోగం



ఆకివీడు, ఫిబ్రవరి 1: ఆకివీడు రూరల్ సొసైటీ చైర్మన్ కేశిరెడ్డి మురళీ తండ్రి కృష్ణమూర్తి (88) గురువారం మృతి చెందారు. కుటుంబ సభ్యులను పలువురు పరామర్శించారు.

జనసేన అధికార ప్రతినిధిగా సత్యన్



నరసాపురం టౌన్, ఫిబ్రవరి 1: జనసేన పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధిగా దివి సత్యన్ నియమితులయ్యారు. పార్టీకి సత్యన్ చేస్తున్న సేవల్ని గుర్తించి కన్వీనర్ బొమ్మిడి నాయకర్ ఆయనకు కీలకమైన బాధ్యతల్ని అప్పగించారు. ప్రస్తుతం సత్యన్ కాపు సంక్షేమ సంఘ జిల్లా అధికార ప్రతినిధిగా కొనసాగుతున్నారు. గతంలో మెగా ఫ్యాన్స్ అసోసియేషన్‌లో ఆయన పలు పదవులు చేపట్టారు. బాధ్యతలు చేపట్టిన సత్యన్‌ను పార్టీ నాయకులు కోటిపల్లి వెంకటేశ్వరరావు, వలవల నాని, వాతాడి కనకరాజు, బొమ్మిడి సూర్యకుమారి, అరుణ, పోలిశెట్టి నళిని, గంటా వేణు అభినందించారు.

సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాలి

నరసాపురం టౌన్, ఫిబ్రవరి 1: పండుగలు, జాతర్లతో పాటు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలపై నేటి తరానికి అవగాహన కల్పించాలని మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు డాక్టర్ రాజ్యలక్ష్మి అన్నారు. గురువారం పొన్నపల్లి గంట్లమ్మ జాతరలో భాగంగా బొమ్మిడి శ్రీనివాస్ ఆర్థిక సహకారంతో ముగ్గుల పోటీలను ఏర్పాటు చేశారు. విజేతలకు బహుమతులందించారు.

పెదఅమిరంలో ఎన్ఎస్ఎస్ శిబిరం



పెదఅమిరం ఎన్ఎస్ఎస్ శిబిరంలో ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల సిబ్బంది

కాళ్ళ, ఫిబ్రవరి 1 : పెదఅమిరం గ్రామంలో ఎస్ఆర్‌కేఆర్ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు సేవా శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డా.ఎం జగపతిరాజు మాట్లాడుతూ పల్లెల్లో శానిటేషన్, డ్రింకింగ్ వాటర్, పర్యావరణం, పరిశుభ్రత వంటి సమస్యలపై ప్రతీ ఇంటికి వెళ్ళి విద్యార్థులు వారిలో చైతన్యం తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ సోమేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి సునీల్‌రాజు, కళాశాల కో-ఆర్డినేటర్స్ జి.మెహర్ గణేష్ పాల్గొన్నారు.



జనసేనలో 50 మంది చేరిక

పెంటపాడు, ఫిబ్రవరి 1: దళితులకు జనసేన అండగా ఉంటుందని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్ చార్జి బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. జనసేన నాయకులు సజ్జా సుబ్బు, కొనకళ్ళ హరినాథ్ ఆధ్వర్యంలో పెంటపాడు కూనాకారపేటకు చెందిన సుమారు 50 మంది గురువారం బొలిశెట్టి సమక్షంలో జనసేనలో చేరగా వారికి బొలిశెట్టి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బొలిశెట్టి మాట్లాడుతూ దళితులకు పెద్దపీట వేస్తామని అధికారం చేపట్టిన వైసీపీ దళితులపై వరస దాడులు జరుగుతున్నా చోద్యం చూస్తోందన్నారు. పుల్లా బాబి, కసిరెడ్డి మధులత, పెనుబోతుల సోమాలమ్మ, చాపల రమేష్, మలబాకు చిట్టి, మన్నీడి రమేష్, నేదురు స్వామినాయుడు పాల్గొన్నారు.

రేపు వాడపల్లి వెంకన్న కల్యాణం


బలుసులమ్మ ఆలయం వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న మంత్రి కొట్టు

తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 1: తాడేపల్లిగూడెం బలుసులమ్మ ఆలయం వద్ద ఈ నెల 3న దేవదాయ, ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో ధార్మిక పరిషత్ నిర్వహణలో వాడపల్లి వేంకటేశ్వ రస్వామి ఏడు ప్రదక్షిణలు, కల్యాణోత్సవం నిర్వహించనున్నట్టు దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ పేర్కొన్నారు. గురువారం ఆలయంలో ఆయన ఏర్పాట్లను పరిశీలించి మాట్లాడుతూ 3న సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకూ ఏడు ప్రదక్షిణలు, అనంతరం కల్యాణం జరుగుతుందని, ఈ అవకాశాన్ని తాడేపల్లిగూడెం నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట బలుసులమ్మ ఆలయ కమిటీ చైర్మన్ కొట్టు అంజిబాబు, సభ్యులు, వాడపల్లి ఆలయ ఈవో సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

అంకిత భావంతో పనిచేయాలి


డ్రైవర్‌లను సత్కరిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 1: వృత్తి పట్ల అంకిత భావంతో పనిచేసిన వారే ఉన్నతంగా ముందుకెళ్తారని ఆర్టీసీ డిపో మేనేజర్ వై. సత్యనారాయణ మూర్తి పేర్కొన్నారు. తాడేపల్లిగూడెంలోని నన్నయ వర్సిటీలో రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా డ్రైవర్స్ డే నిర్వహించారు. వృత్తిలో ప్రతిభ చూపిన డ్రైవర్‌లను సత్కరించారు. ప్రిన్సిపాల్ టి. అశోక్ మాట్లాడుతూ డ్రైవర్‌లే ఆర్టీసికి విలువైన ఆస్తి అన్నారు. ఆర్టీసీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అలరించిన సినీ ఆర్కెస్ట్రా



భీమవరం టౌన్, ఫిబ్రవరి 1 : మావుళ్ళమ్మ ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి ఆలయం వద్ద తాడేపల్లిగూడెంకు చెందిన మాస్ట్రో మెలోడీస్ ఆర్కెస్ట్రా గాయకులు ఆలపించిన గీతాలు ఆకట్టుకున్నాయి. దాదాపు మూడు గంటల పాటు సాగింది. పాత, కొత్తకలయిక పాటలు మైమరపించాయి. మధ్యాహ్నం మూడు గంటలకు ఇళ్ళ సత్యనారాయణ భజన, సాయంత్రం 4 గంటలకు కెల్లా జగన్నాథం చే పోతన భాగవతం నుంచి ప్రవచనాలు జరిగాయి. రాత్రి 8-30కు మావుళ్ళమ్మ నాట్యమండలి సమర్పణలో రెండు రత్నాలు నాటకాలు ప్రదర్శించారు.

రాష్ట్ర ప్రజల సంక్షేమమే ప్రభుత్వ అజెండా


కాళ్ళ, ఫిబ్రవరి 1: రాష్ట్ర ప్రజల సంక్షేమమే అజెండాగా పరిపాలన చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి అందరూ అండగా నిలవాలని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు కోరారు. పెదఅమిరం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన ప్రతీ ఇంటికి వెళ్ళి సంక్షేమ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ డొక్కు సోమేశ్వరరావు, జడ్పీటీసీ పచ్చిగోళ్ళ సోమేశ్వరరావు, ఎంపీపీ పెన్మెత్స శిరీష, ఉపసర్పంచ్ జవ్వాది కిషోర్ పాల్గొన్నారు.

పది విద్యార్థుల ప్రత్యేక తరగతుల తనిఖీ


రికార్డులను తనిఖీ చేస్తున్న ఉప విద్యాశాఖాధికారి శ్రీరాం

వీరవాసరం, ఫిబ్రవరి 1: పదవ తరగతి విద్యార్థుల కోసం జడ్పీ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను జిల్లా ఉపవిద్యాశాఖాధికారి బి.శ్రీరాం తనిఖీ చేశారు. గురువారం రాయకుదురు జడ్పీహైస్కూల్‌ను సందర్శించారు. పాఠశాలలో రికార్డులను తనిఖీ చేయటమేకాక పది విద్యార్థుల ప్రత్యేక తరగతుల నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థుల కోసం తీసుకున్న చర్యలను హెచ్ఎం వివరించారు.

ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షుడిగా బ్రహ్మానందం



ఉండి, ఫిబ్రవరి 1:ఉండిలోని సుజల వాటర్ ప్లాంట్ నిర్వాహకుడు కనిగళ్ల బ్రహ్మానందం జిల్లా ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షుడుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈమేరకు గురువారం పత్రికలకు వివరాలను ఆయన అందించారు. ఫిబ్రవరి నెల 4వ తేదీన ఉమ్మడి పశ్చిమగోదావరిజిల్లా ఏలూరులో జరిగే ఆర్యవైశ్య సంఘం జిల్లా సమావేశంలో ప్రమాణస్వీకారం చేయనున్నట్లు తెలిపారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి


టీటీ విజేతలకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

పెంటపాడు, ఫిబ్రవరి 1: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ప్రత్తిపాడు ఏఎస్ఆర్ హోమియో వైద్య కళాశాల చైర్మన్ ఆకుల విజయ్‌వర్ధన్ బాబు, విజయవాడ వైఎస్ఆర్ హెల్త్ వర్సిటీ స్పోర్ట్స్ బోర్డ్ కార్యదర్శి డాక్టర్ ఈ.త్రిమూర్తి అన్నారు. ప్రత్తిపాడు ఏఎస్ఆర్ హోమియో వైద్య కళాశాలలో జరుగుతున్న వైఎస్ఆర్ హెల్త్ యూనివర్సిటీ పరిధిలోని అంతర హోమియో వైద్య కళాశాలల రాష్ట్ర స్థాయి క్రీడాపోటీలు బుధవారం రాత్రి ముగిశాయి. విజేతలకు విజయ్‌వర్ధన్‌బాబు, డాక్టర్ త్రిమూర్తి బహుమతులు అందజేశారు. ఏఎస్ఆర్ విద్యాసంస్థల సీఈవో రాజశేఖర్, ప్రిన్సిపాల్ ప్రసాద్, ప్రొఫెసర్లు డాక్టర్ సురేంద్ర, డాక్టర్ ధనాల సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్లలో సదుపాయాలు కల్పించాలి


పోలింగ్ స్టేషన్లను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం టౌన్, ఫిబ్రవరి 1: పోలింగ్ స్టేషన్లలో నూరు శాతం మౌలిక సదుపాయాలు కల్పించాలని జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి ఆదేశించారు. చినఅమిరం, రాయలం, పురపాలక సంఘం పరిధిలో 19, 25, 32 వార్డుల్లో పోలింగ్ స్టేషన్లను గురువారం కలెక్టరు పరిశీలించారు. పోలింగ్ స్టేషన్ లోపలికి వెలుపలకు రాకపోకలకు వీలుగా రెండు వేరువేరు ద్వారాలను ఏర్పాటు చేయాలన్నారు. మహిళలకు, పురుషులకు వేరు వేరుగా టాయిలెట్స్ ఏర్పాటు, నేమ్ బోర్డులు పెట్టాలన్నారు. దివ్యాంగులకు మూడు చక్రాల సైకిల్ సులువుగా రాక, పోకలకు ర్యాంపులు ఏర్పాటు ఉండాలన్నారు.

పేదరిక నిర్మూలనే లక్ష్యం

పాలకొల్లు టౌన్, ఫిబ్రవరి 1: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో నాలుగు వర్గాలకు ప్రాధాన్యత ఇచ్చినట్లుగా నిర్మలా సీతారామన్ ప్రకటించారని బీజేపీ కృష్ణాజిల్లా ఇన్‌చార్జి ఉన్నమట్ల కబర్ధి విలేకరులకు తెలిపారు. రైతులు, మహిళలు, యువత, పేదలను శక్తివంతం చేసేందుకు బీజేపీ ప్రభుత్వం పనిచేసిందన్నారు. 2047 నాటికి పేదరికాన్ని పారదోలాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్టుగా కేంద్ర మంత్రి చెప్పారన్నారు. దేశంలోని నాలుగు కోట్ల మంది రైతులకు పసల్ బీమా యోజన కింద పంటల బీమా అందించిన విషయాన్ని కేంద్రమంత్రి గుర్తు చేశారని కబర్ధి తెలిపారు. ఆర్థిక రంగం అనేక ఒడిదుడుకులు ఎదుర్కొన్నప్పటికీ భారత్ అన్ని రంగాల్లో వృద్ధిలో సాగిన విషయాన్ని నిర్మలా సీతారామన్ తన బడ్జెట్ ప్రసంగంలో ప్రస్తావించారన్నారు. భారత దేశ ప్రజల ఆదాయం 50శాతం పెరిగిన విషయాన్ని మంత్రి గుర్తు చేసినట్లు కబర్ధి తెలియజేశారు.

క్షీరా రామంలో ధర్మ ప్రచార వారోత్సవాలు




పాలకొల్లు, ఫిబ్రవరి 1: పాలకొల్లు క్షీరా రామలింగేశ్వరస్వామి ఆలయంలో నాలుగు రోజులుగా దేవదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ధర్మ ప్రచార వారోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. దీనిలో భాగంగా గురువారం భక్తులు క్షీరారామలింగేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మహిళా కళాకారులు చేసిన నృత్య ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. దేవస్థానం చైర్మన్ కోరాడ శ్రీనివాసరావు, ఈవో యాళ్ల సూర్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

ఉచిత వైద్య పరీక్షలు


భీమవరం టౌన్, ఫిబ్రవరి 1 : పట్టణంలోని యూత్ కల్చరల్ క్లబ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ఎముకలు, కీళ్ళ నొప్పులపై ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. హైదరాబాద్ స్టార్ హస్పటల్‌కు చెందిన ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ శశికాంత్, వైద్యులు ఈ పరీక్షలు నిర్వహించారు. దీంతోపాటు ఉచిత సుగర్, బీపీ, న్యూరోపతి పరీక్షలు కూడా ఉచితంగా నిర్వహించారు. సీనియర్ మేనేజర్ పద్మాకర్, క్లబ్ సెక్రటరీ కేవీ సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

కల్లుగీత కార్మిక సంఘం కార్యవర్గం


అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శిగా రామచంద్రరావు, నరసింహ మూర్తి

తణుకు, ఫిబ్రవరి 1: రాష్ట్ర కల్లుగీత కార్మిక సంఘం నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. తణుకులో జరిగిన రాష్ట్ర సభలో రాష్ట్ర అధ్యక్షుడిగా వాకా రామచంద్రరావు, ప్రధాన కార్యదర్శిగా జుత్తిగ నరసింహమూర్తిని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా కామన మునిస్వామి, ఎర్ర దేవుడు, అనకాపల్లి, గుంటూరు జిల్లా నుంచి యామినేని స్టాలిన్, విజయనగరం జిల్లా నుంచి సిమా అప్పారావు, సహాయ కార్యదర్శిగా బత్తిన నాగేశ్వరరావు, బొక్క చంటితో పాటు 16 మందితో కమిటీని ఎన్నుకున్నారు.

వేల్పూరులో అభివృద్ధి అంటేనే ఆరిమిల్లి కుటుంబం


మాట్లాడుతున్న టీడీపీ అధికార ప్రతినిధి వల్లూరి మోహనరావు

తణుకు, ఫిబ్రవరి 1: వేల్పూరులో జరిగిన అభివృద్ధి అంటేనే ఆరిమిల్లి వెంకటరత్నం కుటుంబం గుర్తొస్తుందని టీడీపీ వేల్పూరు గ్రామ అధికార ప్రతినిధి వల్లూరి మోహన్ అన్నారు. గురువారం వేల్పూరు పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ నాయకులు పీహెచ్‌సీ, ఇళ్ల స్థలాలపై చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అబద్ధాలు మాట్లాడటం వైసీపీ నాయకులు మానుకోవాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించి సీహెచ్‌సీని పార్కులో ఎందుకు కట్టారో మంత్రి కారుమూరి సమాధానం చెప్పలేక వేల్పూరు వైసీపీ నాయకులతో బురద జల్లే ప్రయత్నం చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. వేల్పూరు ప్రజలు విజ్ఞులని అన్నీ గమనిస్తున్నారన్నారు. మాజీ ఉప సర్పంచ్ రెడ్డి నరేంద్ర ప్రసాద్, వార్డు సభ్యులు గుణ్ణం శ్రీదేవి, ఉప సర్పంచ్ గుణ్ణం రాజారావు, విశ్వనాథం శ్రీనివాసు, రెడ్డి శివరామకృష్ణ, రెడ్డి కేశవ తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం రూరల్ ఎస్సైగా సురేశ్



తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 1: తాడేపల్లిగూడెం రూరల్ ఎస్సైగా పి. సురేశ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన రాజానగరం నుంచి బదిలీపై వచ్చి విధుల్లో చేరారు. ఇక్కడ పనిచేసిన ఎస్సై బి. రాజు భీమవరం రూరల్‌కు బదిలీపై వెళ్లారు.

పురందేశ్వరి సభకు తరలిన బీజేపీ నాయకులు

పాలకొల్లు టౌన్, ఫిబ్రవరి 1: భీమవరంలో గురువారం బీజేపీ కార్యాలయం ప్రారంభోత్సవానికి విచ్చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరికి స్వాగతం పలికేందుకు పాలకొల్లు నియోజకవర్గం నుంచి బీజేపీ శ్రేణులు బైక్‌ర్యాలీగా తరలివెళ్లారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు జక్కంపూడి కుమార్, నియోజకవర్గ ఇన్‌చార్జి యర్రంశెట్టి పద్మారావు, నాగరాజు బదిరీ నారాయణరాజు తరలి వెళ్లారు.